క్లుప్తంగా

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కామేపల్లి: ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి చందన అన్నారు. బుధవారం మండలంలోని పండితాపురం ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహించొద్దని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

25న ద్వితీయ వార్షికోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న పుల్లంరాజు

ఖమ్మంఅర్బన్: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈనెల 25వ తేదీన విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.వీ.పుల్లంరాజు తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. వార్షికోత్సవ సమావేశంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు పెద్దసంఖ్యలో ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

నన్‌కు ఘన సన్మానం

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటలో గల కరుణగిరి చర్చిలో గత 50 ఏళ్లుగా సిస్టర్‌గా సేవలందిస్తున్న మొదటి సిస్టర్(నన్) మేడికొండ మరియమ్మను బుధవారం తోటి సిస్టర్లు ఘనంగా సన్మానించారు. మధిర మండలం బయ్యారం గ్రామానికి చెందిన మరియమ్మ గత 50 ఏళ్లుగా కథోలిక క్రైస్తవ సంఘం ఎఫ్ఎంఎం సంస్థలో చేరి వివిధ రాష్ట్రాలలో పేదలకు విద్య, వైద్య సేవలు, క్రీస్తు బోధనలు అందిస్తూ ఉత్తమ సేవకురాలిగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా కర్నూలు బిషప్ గోరంట్ల జొనేస్, ఖమ్మం బిషప్ పగిలి ప్రకాష్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందన చర్చి ఫాదర్లు, మఠ కన్యలు, బంధువులు, ఫాదర్ ప్రాన్సిస్, స్లీనప్ప, తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

తిరుమలాయపాలెం: మండలంలోని మేడిదపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు రావుల నారాయణరెడ్డి మృతికి పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు బుధవారం మేడిదపల్లిలో నివాళులర్పించారు. గ్రామంలో పార్టీ అభివృద్ధి కోసం నారాయణరెడ్డి కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు విక్రమ్, బషీరుద్దిన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు రాజశేఖర్, బండారు సైదులు, మోర ఉపేందర్‌రెడ్డి, రావుల క్రిష్టారెడ్డి, అంగిరేకుల నర్సయ్య, స్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

తెలంగాణ తొలిదశ పోరాటయోధుడికి..

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ తొలిదశ పోరాటయోధుడు కొలిశెట్టి రామదాసు మృతిపై మున్నూరు కాపు సంఘం నేతలు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర, ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, కార్యదర్శి శెట్టి రంగారావు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కొలిశెట్టి రామదాసు అగ్రభాగాన నిలిచి పోరాడారని వారు కొనియాడారు. ఆయన మరణం మున్నూరుకాపు సంఘానికి తీరనిలోటన్నారు. జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరావు, కనిశెట్టి నర్సయ్య, హనుమంతరావు, సీతారాములు, రవికుమార్, శీలంశెట్టి వీరభద్రం, తోటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	26	పాలకూర	2
పచ్చిమిర్చి	110		10
కాకర	54	చుక్కకూర	2
బీర	70		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	90	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	16		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	48		30
క్యారెట్	66	పుదీన	1
క్యాప్సికం	60		20

–ఖమ్మం వ్యవసాయం

చెరువు మట్టి తోలకాలలో నిబంధనలు పాటించాలి

ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు


మాట్లాడుతున్న మన్మధరావు

నేలకొండపల్లి: చెరువు మట్టి తోలకాలలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని తన చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు చెరువు మట్టి తోలకాలలో ఎక్కడ పడితే అక్కడ తవ్వకుండా, ఒక క్రమ పద్ధతిలో నిబంధనలకు లోబడి మట్టి తరలించాలని సూచించారు. అదే విధంగా ఉపాధి కూలీలు చెరువులో పని చేసే చోట వారికి ఇబ్బంది లేకుండా దూరంగా గుంతలు ఏర్పడకుండా మట్టి తవ్వకాలు చేపట్టాలని పేర్కొన్నారు. లష్కర్లు పని ప్రదేశంలోనే ఉంటారన్నారు. అదే విధంగా చెరువు సొసైటీ సభ్యులు కూడా దగ్గరుండి వారికి అనుకూలంగా చెరువు తవ్వకాలు చేపట్టే విధంగా చేయించుకోవాలని తెలిపారు. మండలంలోని దాదాపు 19 చెరువులలో మట్టి తోలకాలకు రైతులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకోగా.. అందులో చెరువుమాధారంలో 50 మంది, ముజ్జుగూడెంలో 50 మంది, మంగ్రాజుపల్లిలో 30 మంది, సుర్దేపల్లిలో 30 మంది ఉన్నారని చెప్పారు.నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు.

డయాగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల అశోక్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని డయాగ్నస్టిక్ కేంద్రాలు నిలువు దోపిడీకి అడ్డాలుగా మారాయని, ఆస్పత్రి వర్గాలు, డయాగ్నస్టిక్ కేంద్రాల యజమానులు సిండికేట్ అయి రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ అన్నారు. గురువారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డయాగ్నస్టిక్ సెంటర్ల యజమానులు, ఆస్పత్రి వర్గాలు కుమ్మక్కై వారి వ్యాపారం కోసం అవసరం ఉన్నా లేకున్నా.. రోగికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయిస్తున్నారన్నారు. ఆస్పత్రికి ఒక ఆరోగ్య సమస్యపై వచ్చిన రోగికి అదనంగా మరో రెండు మూడు రకాల పరీక్షలు రాసి వాటన్నింటిని చేయించాలని చెబుతూ.. రోగులను నిలువునా దోచుకుంటున్నారని, అటువంటి ఆస్పత్రి వర్గాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరం లేకున్నా స్కానింగ్‌లు చేయిస్తున్న, చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నిలువు దోపిడీని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో జిల్లాలో ఉద్యానవన పంటలు, కూరగాయల పంటల రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని 11 మండలాల్లో 548 మంది రైతులకు చెందిన 2 వేల ఎకరాలలో మామిడి, బొప్పాయి తోటలు అకాల వర్షానికి దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు కె.శ్రీను, సురేష్, అశోక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం..


నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా అశ్వారావుపేటలో ఆకస్మికంగా గుండెపోటుతో మరణించిన పోలూరు శ్రీకృష్ణ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా నిలుస్తామని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. బుధవారం ఖమ్మంలోని ఆయన స్వగృహంలో శ్రీ కృష్ణ భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జిల్లా పరిషత్ కార్యాలయంలో అంకితభావంతో పనిచేయడమే కాకుండా క్రమశిక్షణ కలిగిన ఉద్యోగిగా అందరి మన్ననలు అందుకున్నారన్నారు. ఆయన ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులకే కాకుండా జిల్లా ప్రజా పరిషత్‌కు కూడా తీరని లోటన్నారు. ప్రభుత్వం నుంచి వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన బెనిఫిట్స్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ ప్రసూన రాణి, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అరుణ, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేష్, స్టేట్ కౌన్సిలర్ వై.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో 'స్వచ్ఛ భారత్'


కళాశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజేశ్వరరావు ప్రారంభించగా.. కళాశాలకు చెందిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొని చీపుర్లు చేతపట్టి శుభ్రం చేశారు. ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి ఆవరణలో చెత్తా, చెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత వల్లే వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా కళాశాల ఆవరణ అంతా శుభ్రం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి. కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలి దుమారానికి దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన


గంగబండతండాలో ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

కూసుమంచి: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షం, గాలి దుమారానికి దెబ్బతిన్న ఇళ్లను బుధవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. గంగబండతండా గ్రామంలో పలు ఇళ్లను పరిశీలించి జరిగిన నష్టాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు.విషయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్‌రావు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్, పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి, పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మట్టే గురవయ్య, నాయకులు ఎండీ హఫీజుద్దీన్, దాసరోజు వెంకన్న, పెండ్ర అంజయ్య, మాధవరెడ్డి, గోపిగౌడ్, వెంకటేష్, వడ్డియా సుందర్, బానోతు రమేష్ నాయక్, బొంగా నాయక్, భిక్షంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు


గోల్‌తండా స్టేజీ వద్ద విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న అధికారులు


ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా పరిసర గ్రామాల్లో గాలిదుమారానికి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయి తీవ్రనష్టం వాటిల్లిన విషయం విధితమే. దీంతో మంగళవారం రాత్రి విద్యుత్ అధికారులు కొన్ని గ్రామాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించగా.. బుధవారం విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్ ఆదేశాల మేరకు ఏడీఈ రామకృష్ణ, డీఈ నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఏఈ రవికుమార్ విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. 15 మంది సిబ్బందితో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి మండలంలోని గోల్‌తండా, పాతర్లపాడు, గోపాయిగూడెం, జింకలగూడెం గ్రామాలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. గాలిదుమారంతో సుమారు రూ.20లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఏఈ తెలిపారు. కాగా, గాలి దుమారానికి ఇళ్ల పైకప్పులు లేచిపోయిన బాధితులను ఆదుకోవాలనిగ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని బాలపేట విద్యుత్ ఫీడర్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జయనగర్‌కాలనీ, బాలపేట, బల్లేపల్లి, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

విద్యుత్ లైన్‌ల మరమత్తుల కారణంగా..

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ లైన్‌ల మరమత్తుల కారణంగా నగరంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్‌సెక్షన్ ఏఈలు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఆర్టీఓ ఆఫీస్ ఫీడర్, 33/11 కేవీ ఎస్ఎస్‌పీ, ప్రభుత్వ ఆస్పత్రి ఫీడర్ ఇల్లెందు క్రాస్ రోడ్ సబ్‌స్టేషన్ల పరిధిలో బైపాస్‌రోడ్డు, కొత్త బస్టాండ్, వికలాంగుల కాలనీ, రమణగుట్ట, శ్రీరాగిరి, వీడీవోస్ కాలనీ, వైరా రోడ్డు, శ్రీకృష్ణనగర్, కృషిభవన్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్3 ఏఈ బి.తావుర్యా తెలిపారు. అలాగే గాంధీచౌక్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎంఆర్‌ఓ ఆఫీస్ రోడ్డు, సాయిరాం థియేటర్ రోడ్డు, మోతీనగర్, బొక్కలగడ్డ, పంపింగ్‌వెల్ ఫిల్టర్ బెడ్, పంపింగ్‌వెల్ ఆటోస్టాండ్, పెద్దమ్మ తల్లి గుడి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందనిటౌన్ 1 ఏఈ మౌలిక తెలిపారు.

సదాశివాపురంలో ఘర్షణ

నేలకొండపల్లి: మండలంలోని సదాశివాపురంలో బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఓ పంచాయతీకి సంబంధించి గ్రామానికి చెందిన సైదులు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన పలువురు దాడి చేసి గాయపరిచారు. ఈమేరకు బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఖమ్మంలో కమల వికాసం ఖాయం

బీజేపీ ఎంపీ అభ్యర్థి వినోద్‌రావు


వినోద్‌రావు దంపతులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసినా బీజేపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యాన బుధవారం నగరంలోని 25వ, 26వ, 37వ, 39వ డివిజన్లలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖమ్మంలో కమలం వికసించడం ఖాయమని, తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాండ్ర దంపతులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర సతీమణి వినీలా, లక్ష్మీకుమారి, సీనియర్ నాయకులు గెంటెల విద్యాసాగర్, సరస్వతి, వెంకటనారాయణ, నరేష్, డీకొండ శ్యామ్, వీరస్వామి, మధుసూదన్‌రావు, రవీంద్రకుమార్, మృత్యుంజయరావు, పద్మావతి, ధర్మేందర్, రామారావు, ఫణికుమారి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

19న సీపీఎం కార్యాలయ ప్రారంభోత్సవం


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఇందిరానగర్ వద్ద నిర్మించిన సీపీఎం ఖానాపురం హవేలీ కార్యాలయాన్ని ఈ నెల 19వ తేదీన ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖానాపురం హవేలీ కార్యాలయంలో దొంగల తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరజీవి సత్తెనపల్లి రామకృష్ణ స్మారక భవనం పేరుతో ఖానాపురం హవేలీ కార్యాలయం నిర్మించామన్నారు. ఈ భవన ప్రారంభోత్సవానికి కేరళ మాజీ వైద్య శాఖమంత్రి శైలజ టీచర్ హాజరుకానుండగా, కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారని తెలిపారు. భవన ప్రారంభోత్సవానికి సీపీఎం శ్రేణులు, అభ్యుదయవాదులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, మాచర్ల భారతి, మీరా సాహెబ్, యర్రా శ్రీనివాస్, జబ్బార్, బండారు రమేష్, మెరుగు సత్యనారాయణ, కేవీ.నవీన్, భూక్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వైద్యసేవలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: నిరుపేదలకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యసేవలు అందించాలని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ కోరారు. బుధవారం ఖమ్మం గాంధీ పార్కులోని సంఘకార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ కార్యదర్శి గుడిమళ్ల సూర్యప్రకాశరావు ఆధ్వర్యాన ఈనెల చివరి వరకు తేదీల వారిగా జిల్లాలోని వివిధ గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. సంస్థ అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.రవీందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాధినేని జనార్ధన్‌రావు, కోశాధికారి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు సుబ్బయ్య, మూలగుండ్ల శ్రీహరి, వెంకటాచారి, మేకల వెంకటేశ్వర్లు, జోసఫ్, మోహన్‌రావు, నరసయ్య, సభ్యులు డీ.కే.శర్మ మారంరాజు రాధాకృష్ణారావు, అనాశి రాధాకృష్ణ, హనుమంతరావు, దొబ్బల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలన సిద్ధాంత వైతాళికుడు 'మారోజు'


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కులనిర్మూలన సిద్ధాంత వైతాళికుడు మారోజు వీరన్న అని పీడీఎస్‌యూ మాజీ నాయకుడు కాకి భాస్కర్ అన్నారు. లింగబోయిన లక్ష్మణ్ అధ్యక్షతన బుధవారం ఖమ్మంలో జరిగిన వీరన్న వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మారోజు వీరన్న ఓ సిద్ధాంత కర్త అని, ఈదేశ విముక్తి చేసే సిద్ధాంతాన్ని ఆయన రాశాడని కొనియాడారు. అనంతరంబహుజన కమ్యునిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి రాంబాబు మాట్లాడగా.. వెంకయ్య, కిషన్ నాయక్, సురేష్, కొంగర శ్రీను, కుమ్మరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లోతు దుక్కులు.. లాభాలు దక్కు!


లోతు దుక్కుల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ (ఫైల్)

వేసవి దుక్కులకు ఇదే అనువైన సమయం

- పురుగులు,తెగుళ్లు, కలుపు నిర్మూలనకు అవకాశం
- భూమిలో సారం, తేమ శాతం పెంపు
- ప్రయోజనాలు అధికమంటున్న వ్యవసాయాధికారులు

కామేపల్లి: యాసంగి పంటల సీజన్ పూర్తయింది.. వేసవి దుక్కులకు వేళయింది. పంట పూర్తయిన తర్వాత అవశేషాలను తొలగించకుండా దుక్కులు దున్నితే భూసారం పెరుగుతుందని, పురుగు, కలుపు మొక్కలు, తెగుళ్ల నివారణకు ఎంతో ప్రయోజనకరంగా ఉండడంతో పాటు పంట దిగుబడి కూడా ఎక్కువగా సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. భూమిలో ఉండే శిలింధ్రాలు మట్టిపైకి రావడంతో అధిక ఉష్ణోగ్రతలతో వ్యాధి కలుగజేసే శక్తిని కోల్పోయి పంటలకు తెగుళ్ల సోకకుండా దోహదపడుతాయని పేర్కొంటున్నారు. పంటలు వేసే సమయాన కలుపు పెరిగి నేలలోని నీరు పోషక పదార్థాలను గ్రహించి దిగుబడిని తగ్గిస్తుంటాయి. అయితే దుక్కులు లోతుగా దున్నడంతో కలుపు మొక్కలు నేలపైకి వచ్చి అధిక ఉష్ణోగ్రతలతో నశించిపోతాయి. ఫలితంగా పంటల సాగులో కలుపు మొక్కల తాకిడి తక్కువగా ఉంటుంది.

పొరలు తిరగబడి..

పంట కోతల తర్వాత పొలాన్ని దున్నకుండా, వదిలి వేయకుండా వర్షాలకు ముందే దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే, భూమిలోకి నీరు ఇంకి, భూమి కోతకు గురికాకుండా చేస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూమిని లోతుగా దున్నడంతో పైపొరలు కింద పొరలపైకి తిరగబడి నేల సారవంతమవడంతో పాటు భూమిలో తేమ శాతం పెరిగి భూసారం అభివృద్ధి చెందుతుందన్నారు. దుక్కులను వాలుకు అడ్డంగా దున్నుకోవాలని, వాలు వెంట దున్నితే నేల కోతకు గురయ్యే అవకాశముంది.

అవశేషాల సద్వినియోగం..

పంట కోతల తర్వాత మిగిలిన పంట అవశేషాలు కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు లోతు దుక్కిలో కలిసిపోయి సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడతాయి. దీంతో నేలలో కర్బన శాతం, పోషక పదార్థాలు పెరిగే అవకాశముంది.

పొలంలో మందలు నిలపాలి..

దుక్కి దున్నే ముందు గొర్రెలు, మేకలు, పశువుల మందలు పొలంలో తిప్పాలి. పశువుల ఎరువు, కంపోస్టు ఎరువులు, పూడిక మట్టిని వేయడం వల్ల పంట అధిక దిగుబడి వస్తుంది. పొలంలో మందలు పెట్టడంతో వాటి మలవిసర్జన భూమిలోకి ఇంకి భూసారం వృద్ధికి ఉపయోగపడుతుంది. పంటలు పూర్తయిన తర్వాత ఎండు ఆకులు, చెత్తాచెదారం కాల్చి వేయకుండా వాటిని పొలంలోనే ఉంచి భూమిలో లోతుగా కుప్పలు వేయడంతో నేల పొరల్లో కలిసి ఎరువుగా మారి, భూసారం పెరిగి పంటలకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. లోతుగా దున్నడంతో చీడ పురుగుల గుడ్లు, లార్వాలను పక్షులు తిని నాశనం చేస్తుంటాయి.

ఏటా వేసవిలోనే దున్నుతా..



ఏటా వేసవిలోనే దుక్కి దున్నుతా. దీంతో పంట సాగు చేసినప్పుడు మొక్కలు ఏపుగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో వస్తుంది. పెట్టుబడి కూడా తక్కువే. వర్షం పడిన సందర్భంలో భూమి కోతకు గురికాకుండా ఎంతో దోహదపడుతుంది.

– సామా మోహన్‌రెడ్డి, రైతు, మద్దులపల్లి

కలుపు, తెగుళ్ల బెడద తక్కువ..



వేసవి దుక్కులు దున్నడంతో పంటలు సాగు చేసిన సమయాన కలుపు శాతం తక్కువగా ఉంటుంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగు చేయడంతో పంట దిగుబడి రావడంతో పాటు పంట మొక్కలు ఆరోగ్యంగా ఉండి తెగుళ్ల బారిన పడకుండా ఉంటుంది.

– ముత్యాల సత్యనారాయణ, రైతు, పండితాపురం

దుక్కులు దున్నుకోవాలి..



వానాకాలం, యాసంగిలో కోతలు పూర్తయిన తర్వాత తప్పనిసరిగా పొలాన్ని లోతుగా దుక్కులు దున్నుకోవాలి. దుక్కులు దున్నే ముందు పశువుల, సేంద్రీయ ఎరువులు వేస్తే పొలానికి మరింత బలం చేకూరి, కలుపు మొక్కల నివారణతో పాటు చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవచ్చు.

– భూక్యా తారాదేవి, ఏఓ, కామేపల్లి